అమెరికా తెలుగు సంఘం, అమృత్‌కిరణ్ సంయుక్తంగా నిర్వహించిన కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన పొందినకథ

# వెలితి

గరిమెళ్ళ నారాయణ

కాలేజీకి టైమ్ అవడంతో తొందరగా సైకిల్ తొక్కుకుంటూ బయల్దేరాను. నాలుగురోడ్ల జంక్షన్ దగ్గరికి వచ్చేసరికి అలవాటుగా సైకిల్‌కి బ్రేకులు పడ్డాయి. నా స్నేహితుడు ప్రకాష్ కోసం చుట్టూ ఓసారి పరికించి వాడు రావాల్సిన రోడ్డువైపు చూశాను. కనుచూపు మేరలో వాడొస్తున్నాడన్న దాఖలాలేవీ కనిపించలేదు.



'వాడు నాకంటే ముందే కాలేజీకెళ్ళిపోయాడా? లేకపోతే బయల్దేరటం లేటయ్యిందా?' అని నన్ను నేను ప్రశ్నించుకుంటూన్నంతలో 'హలో' అన్న పిలుపుతో వెనక్కు తిరిగి చూశాను. చిరునవ్వులతో నా వైపే తదేకంగా చూస్తోన్న ప్రకాస్ సైకిల్ మీద దర్శనమిచ్చాడు.

"అదేంటి ఈ తోవ నుండొచ్చావు?!" ఆశ్యర్యంగా అడిగాను.

"రోజూ వచ్చే త్రోవలో ఒకాయన చనిపోయాడు. ఇద్దరం పక్కపక్కన సైకిళ్ళు తొక్కుకుంటూ కాలేజీకి బయలేద్దరాం.

"ఆయనెవడో చనిపోతే నువ్వు ఆ తోవలో నుండి రాకపోవడం ఏంటి?"

"ఎవరో కాదు. మాకు కాస్త బాగా తెలిసినాయనే. పాపం ఇంట్లో బాధలతో తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు.అలా చనిపోయిన వాళ్ళని చూసినా వాళ్ళి:ట్లో వాళ్ళ ఏడుపులు విన్నా నా మనసంతా బాధగా, భయంగా ఉంటుంది. అందుకే" అన్నాడు విచారంగా!

"అది కాదు గాని, ఈ మధ్య ఆత్మహత్యలేంటిరా ఇంతెక్కువౌతున్నాయి? అసలెలా చేసుకుంటారోగాని, నాకీ టైపు ఆలోచనలే ఎప్పుడూ రావురా!" వ్యంగ్యంగా అన్నాను.

"నీకూ నాకూ అలాంటి ఆలోచనలు రావడానికేం బాదరబందీలని. 'మూడుపూట్లా మేపి, చదువుకుని బాగుపడండ్రా బాబూ' అని ఇంట్లో వాళ్ళు చెబుతూంటే ఆత్మహత్యలతో మనకి పనేంట్రా?"

"సరదాగా ఏదైనా డౌటు అడిగితే నీకు క్లాస్ తీసుకోడం అలవాటేగా... కానీ..." అన్నాను.

"నువ్వడిగిన తీరు సరదాగా అడిగినట్టు లేదు" అన్నాడు చిరుకోపంతో.

నాకున్న అతికొద్ది మంది ప్రాణ స్నేహితుల్లో ప్రకాష్ ఒకడు.

వాడికి అన్నదమ్ములుగానీ, అక్కచెల్లెళ్ళు గానీ లేరు. తల్లి దండ్రులకు వాడొక్కడే.

ఎప్పుడూ ఈ విషయం గురించే బాధపడే వాడికి ఒక విధంగా ఆ లోటుకూడా తీరిపోయినట్టే. ఎందుకంటే ఆ మధ్యెప్పుడో.

'మా అమ్మగారు మరొకరికి తల్లి కాబోతున్నారు' అంటూ చెప్పాడు.

అంటే వాడికి ఎలాగూ చెల్లో, తమ్ముడో పుడతాడు.

ఈ విషయం ప్రస్తావనకొచ్చినప్పుడల్లా ముఖం చేటంత చేసుకుని "ఇదంతా నా అదృష్టం...," అని తెగ మురిసిపోతూ ఉంటాడు.

వాళ్ళ నాన్నగారు ఎల్.ఐ.సి. ఆఫీస్‌లో ఉద్యోగం చేస్తున్నారు. ప్రకాష్‌కి ఉండే స్నేహం వల్ల వాళ్ళ

కుటుంబంతో మంచి సాహిత్యం ఏర్పడింది.

★ ★ ★

ఉదయం, పదకొండు గంటల సమయం... కాలేజికి శెలవు కావటంతో, మార్కెట్టుకెళ్ళి సామాన్లు తేవాల్సిన బాధ్యత నాకు అప్పచెప్పారు మా ఇంట్లో వాళ్ళు.

దాంతో ఫలితంగా మార్కెట్టుకెళ్ళడం నా వంతయ్యింది.

రోడ్డు బాగా రద్దీగా ఉంది. నా ముందెళ్తోన్న ఓ రిక్షాలో ఎవరో తేల్సున్నవ్యక్తి వెళ్తున్నట్టనిపించి, ఆతృతగా ఆ రిక్షావైపు నడిచాను.

రిక్షావాలాని ఆపమన్నట్టుగా సంజ్ఞ చేశాను. దాన్నిండా బోల్డన్ని చిన్నపిల్ల బొమ్మలున్నాయి.

దాన్లో కూర్చున్న వ్యక్తి తన రెండు ప్రక్కలా కొన్ని బొమ్మల్ని పేర్చుకుని కూర్చున్నాడు.

రిక్షా పైభాగానున్న గుట్ట అందులో నున్న మనిషి ముఖాన్ని కనిపించనివ్వట్లేదు.

దగ్గరకెళ్ళి చూశాను. ప్రకాష్!!"

"రా...నువ్వా...!! కొంపదీసి బొమ్మలషాపు గాని పెడదామనుకుంటున్నావేంటి?!" అన్నాను చమత్కారంతో కూడిన వ్యంగ్యంతో.

వాడు చిన్న నవ్వు నవ్వి... "ఈ రోజుదయం నాకు తమ్ముడు పుట్టాడురా" అందుకనే..."

"ఓహో అదా సంగతి. మరి నెమ్మదిగా చెబుతావేం. కంగ్రాట్యులేషన్స్ మీ తమ్ముడంటే ఎంత ముద్దైతే మాత్రం, ఇన్ని బొమ్మలు కొనెయ్యాలా!!" నోరు తెరిచి ఆశ్చర్యంగా అడిగాను.

"నాకు దీన్ని మించిన సంతోషమరొకటుండదు." అందుకే వాడికోసమని వీటిని కొన్నాను."

"ఎంతయ్యిందేంటి?"

"సిక్స్ హండ్రడ్"

"ఆ...రు..వందలా.. అంత డబ్బెక్కడిదిరా?!"

"చిన్నప్పటినుండి దాచిన డబ్బులన్నిటినీ బ్యాంకులో నుండి తీసి..."

ఆశ్చర్యంనుండి దాదాపు పూర్తిగా తేరుకోవాలని ప్రయత్నించాను.

"ఐతే మీ తమ్ముణ్ణి చూడ్డానికి నన్నెప్పుడు రమ్మంటావు?"

"ఒక్కటిచ్చానంటే ఏడుస్తావు. ఎప్పుడూ మా ఇంటికొస్తూ ఉంటావు. ఈరోజు కొత్తగా అడుగుతావేం. నీ ఇష్టమొచ్చినప్పుడురా." సాన్నిహిత్యంతో కూడిన కోపంతో చివాట్లు పెట్టినంతగా అన్నాడు.

ప్రకాష్‌లో ఉండే ఆ కోపమంటే నాకు చాలా ఇష్టం. ఇలా సందర్భాల్లో కావాలని దాని కోసం ప్రయత్నిస్తుంటాను.

మా మాటలు వింటోన్న రిక్షావాడు ముసిముసి నవ్వులు చిందిస్తున్నాడు.

"ఇంతకీ పేరేంటి పెడదామనుకొంటున్నారు?"

"అది వాడు పుట్టకముందే ఆలోచించా.. ఆకాష్."

"ఆకాషా... ఇదేదో క్రీవణిపేరనుకుంటానే" వ్యంగ్యంగా.

"మా తమ్ముడు. నా ఇష్టం! అయినా వాడెంత ముద్దొస్తున్నాడో తెలుసా? వాడివల్ల ఆ పేరుకి అంద మొస్తుంది. నాపేరు ప్రకాష్... వాడిపేరు ఆకాష్. అంతే' అన్నాడు కొద్దిపాటి గొప్పతనం కొట్టొచ్చిన ముఖకవళికల్తో.

★ ★ ★

ప్రకాష్ వాళ్ళింటికెళ్ళాను. వాళ్ళ నాన్నగారు హాల్లో కూర్చుని ఏదో రాసుకుంటున్నారు.

నలభైఏళ్ళ వయస్సులో మళ్ళీ పిల్లాడు పుట్టినందువల్లో ఏమో సంతోషంగా ఉన్నట్టనిపిస్తున్నారు.

వీధిలో చెప్పులు విప్పుకుంటోన్న నన్ను చూసి "రావోయ్... రా.రా" అన్నారు.

"ప్రకాష్ ఉన్నాడాండీ?" వెళ్తూనే అడిగాను.

"ఆ... స్వీట్స్ కొంటానని బయటికెళ్ళాడు."

"బాబు పుట్టినట్టు నీకు తెలుసా?" తనే కల్పించుకుంటూ అడిగారు.

"ఆ... అదే... చూద్దామని వచ్చాను."

"అయితే... రా చూద్దుగాని" అంటూ గదిలోకి నడిచారు. నేనూ ఆయన్ననుసరించాను.

ఆ గదిలో చంటిపిల్లాడు, పక్కన వాళ్ళమ్మగారు పడుకొని ఉన్నారు.

ఆవిడ నన్ను చూసి "బాగున్నావా... బాబూ?" అంటూ పలకరించారు.

"ఆ బాగానే ఉన్నాను" అంటూ పిల్లాడివైపు చూశాను.

ఎర్రగా ఉన్నాడు. సన్నటి ఎడమకాలిని కుడివైపూ, కుడిచేతిని ఎడమవైపు కదిపాడు. చిన్నగా ఆవులించాడు. చాలా సున్నితంగా అనిపించాడు.

బాగా తెల్లగా ఉన్నాడు. అక్కడక్కడా వాళ్ళమ్మగారి పోలికలు కన్పిస్తున్నాయి. కదలికల్లో వాళ్ళ నాన్నగారు కనిపిస్తున్నారు. ప్రకాష్‌గాడి పోలికలు పెద్దవుతున్నకొద్దీ కనిపిస్తాయేమో?

ఇంతలో "ఏం ఎలా ఉన్నాడు?" అని ఆయన అడిగారు.

అంత సూటిగా అడుగుతారనుకోలేదు. "వెరీఫైన్" వంగుని చంటిపిల్లాణ్ణి చూస్తున్న వాడినల్లా బుర్రపెకెత్తి అతని వైపు చూసి చెప్పాను.

"మంచినీళ్ళు తాగుతావా?" అని అడిగి నా సమాధానం వినకుండా ఫ్రిజ్‌వైపు కదిలారు.

"ఉ..." అనడం మినహా నేనేం చెయ్యలేదు.

నీళ్ళుతాగాక గ్లాసుని టేబిల్‌మీద ఉంచాను.

"ప్రకాష్ వచ్చేవరకూ హాల్లో మాట్లాడుకుందాం అంటూ ఆయన హాలులోకి దారి తీసారు.

అక్కడ నేను సోఫాలో... ఆయన ఈజీఛైర్‌లో కూలబడ్డాం.

కొన్ని క్షణాలపాటు ఆ వాతావరణాన్ని మౌనం ఆవరించింది.

ఏం మాట్లాడాలో తెలీక "ప్రకాష్ కొంచెం చామనఛాయలో ఉంటాడు ఐనా, ఈ పిల్లాడుమాత్రం చాలా తెల్లగా ఉన్నాడండీ" అన్నాను.

"ఆ. అవును. దానికీ కారణం ఉందిలే" ఈజీఛైర్లో ఇంకాస్త ఈజీగా కూర్చున్నట్టు ఫీలౌతూ.

"ఏంటండీ...?" ఆసక్తిగా అడిగాను.

"ప్రకాష్ మాకు పుట్టిన వాడు కాదు."

కొరడాతో కొట్టినట్టు ఉలిక్కిపడ్డాను ఆ మాటలకి ఆయన ఒకటంటే నాకు మరొకటి వినపడుతోందేమో ననుకొని, "ఏంటండి?" మరోసారి అడిగాను.

"అవును బాబూ వాడు మా పిల్లాడు కాదు. చాలాకాలంపాటు మాకు పిల్లలులేరు. ఇంక పుట్టరనుకొని, మేం అనాథ శరణాలయానికి వెళ్ళి మూడు నెలల వయసున్న పిల్లాణ్ణి తెచ్చి పెంచుకున్నాం. ఆ పిల్లాడే ప్రకాష్. తండ్రి వాడు పుట్టకముందే చనిపోయాడట. పెంచే స్తోమతలేక అనాథ శరణాలయానికి వదిలి పోయిందట వాడి తల్లి" కథ చెప్పినట్లుగా చెప్పుకు పోయారు.

నాకు శరీరమంతా కంపించి పోతున్నట్టనిపించింది. ఇప్పటివరకూ ఈ విషయం ప్రకాష్‌నుండి గానీ, ఇతని నుండి గానీ వినలేదు.

"ఇన్నాళ్ళకి సొంతపిల్లడంటూ ఒకడు కలిగాడు. ఈ విషయం ప్రకాష్‌కి తెలీదు" కళ్ళల్లో ఆనందభాష్పాలు మెరుస్తుండగా ఒక గొప్పపని చేసిన తరువాత పొందిన అనుభూతి పొందినట్లు ఆగిపోయారు.

తరువాత నా చదువు గురించీ, మా ఇంటి విషయాల గురించీ ఏవేవో అడిగారు.

ఏవో సమాధానలిచ్చానే కాని, నా ధ్యాసంతా "ప్రకాష్ అనాథ పిల్లాడా?" అని నమ్మలేని ఆలోచనై తిరగాడింది.

ఇంతలో ప్రకాష్ వచ్చాడు. నా మనసులోని భావం కన్పించనీయకుండా ఎప్పటిలాగే క్లోజ్‌గా మాట్లాడాను.

చివర్లో "మీ తమ్ముడు మంచి యాక్టివ్‌గా ఉన్నాడు. ఇంకా నీకు ఫుల్ టైం పాస్. మాతో మాట్లాడ్డానికి తీరిక ఉండదేమో?" అన్నానుకొంటెగా.

"చాల్లేరా. నీ బోడి పొగడ్తలు" అన్నాడు నవ్వుతూ.

★ ★ ★

మా వీధిలోనే ఉంటోన్న మా క్లాస్‌మేట్ రఘూ,

నేనూ కలిసి కాలేజీకి బయలేద్దరాం.

నాల్గురోడ్ల జంక్షన్‌లో ఎంతసేపు వెయిట్‌చేసినా ప్రకాష్ రాకపోయేసరికి, మా కంటే ముందుగానే కాలేజీ కెళ్ళిపోయాడనుకుని ఇద్దరం కాలేజీకి వెళ్ళిపోయాం.

క్లాస్‌లోకి వెళ్ళగానే రవి అన్నాడు.

"ఒరే... ప్రకాష్‌కి తమ్ముడు పుట్టాడట".

"రానీ పార్టీ అడుగుదాం!" అన్నాడు మధు.

మరొకడు "వాడి కోరిక ఇన్నాళ్ళకు తీరిందికదా! ఇంక ఆ పిల్లాడితో ఆడుతూ కాలేజీ ఎగ్గొట్టేస్తాడేమో?" అన్నాడు!

మధ్యమధ్యలో నవ్వులు. బహుశా అదే అయ్యుం టుంది. ఇప్పటి వరకూ కాలేజీకి రాలేదంటే ఇంక ఈరోజు రాడనే అర్థం.

★ ★ ★

రాత్రి తొమ్మిది గంటలవుతోంది. నిశ్శబ్దంగా ఉన్న ఆ వాతావరణంలో స్కూటర్ చప్పుడు వినిపించడంతో నా చదువుకి అంతరాయం కల్గింది. ఆ స్కూటర్ మా ఇంటిముందే ఆగినట్టనిపించడంతో తలుపుతీసుకుని ఇంట్లోనుండి బైటకు వచ్చాను.

బైట వీధిలైట్ల కాంతిలో మెరుస్తున్న బట్టతలను బట్టి ప్రకాష్‌వాళ్ళ నాన్నగారు అని తెల్సింది కానీ, ఇంత రాత్రి ఎందుకొచ్చారో తెలీలేదు.

"రండి...రండి" అన్నాను చూసీ చూడ్డంతోనే.

"అదికాదు బాబూ ప్రకాష్ మీ ఇంటికొచ్చాడా?" గొంతు తగ్గించి అడిగాడు.

"ఊహు... కాలేజీకి కూడా రాలేదు. కన్పిస్తే అడుగుదామని చూస్తున్నాను"

"ఉదయం నేనాఫీసుకెళ్ళాక, పదిగంటలకు బైటకెళ్ళి పోయాడట. ఇప్పటి వరకూ రాలేదు. చెప్పకుండా ఎక్కడికీ వెళ్ళడు. మరెక్కడికి వెళ్ళాడో?"

"వాట్..ఉదయం నుంచి ఇప్పటివరకూ రాలేదా?"

"ఔను... మాకూ అదే ఆశ్చర్యంగా ఉంది! మీ ఫ్రెండ్సెవరిదగ్గరికైనా వెళ్ళాడేమో. ఒకసారి వాళ్ళ ఇంటికెల్దాం వస్తావా?" బ్రతిమాలుతున్న ధోరణిలో.

"తప్పకుండా?" అని ఇంట్లో విషయం చెప్పి ఆయనా, నేనూ స్కూటర్‌పై బయల్దేరాం.

త్రోవలో ఆయన ప్రకాష్ గురించి చెబుతూ.

"వాణ్ణి ఎంత ముద్దుగా చూసుకుంటున్నామో నీకు తెలుసు కదా! వాడు ఏదడిగినా మేం కాదనలేదు. అలాంటిదీరోజు చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడు." అంటూ ఆందోళన చెందడం మొదలెట్టారు.

"మరేం ఫరవాలేదు. ఎక్కడోదగ్గర క్షేమంగానే ఉంటాడు" అంటూ ధైర్యం చెప్పాను నేను.

ఎవరింటి దగ్గరా ప్రకాష్ కనిపించలేదు. ఆయన నన్ను మా ఇంటిదగ్గర దింపి, వాళ్ళింటికి వెళ్ళిపోయారు బాధగా.

ఆ రోజు రాత్రంతా నాకు పిచ్చెక్కినట్టయ్యింది. ప్రకాష్ గురించి ఆలోచనలతో ఏ పనీ చెయ్యాలని పించలేదు. నిద్రకూడా పట్టలేదు.

మర్నాడు ఉదయాన్నే, ఐదు గంటలకు అసలు విషయం తెల్సుకుందామని, సైకిల్ తీసుకుని బైటకు వచ్చాను.

ఇంతలో మా ఇంటికి వస్తోన్న మా క్లాస్‌మేట్ రఘు కనిపించాడు.

వాణ్ణి చూడగానే "ప్రకాష్ గాడి గురించి ఏమైనా తెల్సిందా?" ఆతృతగా అడిగాను."

"వాడు... వాడు... ఆత్మహత్య చేసుకున్నాడట" చెప్పలేక చెప్పలేక చెప్పాడు.

ఆ మాటలకు నన్నెవరో కొట్టినట్టనిపించి, "ఆత్మహత్య చేసుకోబోయి బ్రతికి పోయాడు అంతేనా?" నన్ను నేను సముదాయించుకుంటూ అడిగాను."

"ఊహు... చని పోయాడు" కళ్ళనిండా నీళ్ళతో సమాధానమిచ్చాడు.

నాకు గుండె బరువెక్కి పోయినట్లైంది. పేగులన్నీ ఉండగట్టుకుపోతున్నట్టనిపించింది.

తీవ్రమైన ఒంటరి తనం ఆవహించినట్టనిపించి పెద్దగా ఏడ్చేశాను.

మనూరి స్మశానం దగ్గర నురుగలు కక్కుకుని ఉన్నాడట. ఏమనుకున్నాడో ఏమో. విషం తాగి ఉం డొచ్చు" తనే చెప్పుకుపోతున్నాడు జీరబోయిన గొంతుకతో

నేనూ, రఘూ సైకిళ్ళమీదెళ్ళి అక్కడకు చేరుకున్నాం. ఆ సరికే మా ఫ్రెండ్స్ అంతా అక్కడికొచ్చారు. అప్పుడే కార్లోంచి దిగారు ప్రకాష్‌వాళ్ళ నాన్నగారు, చంటిపిల్లాడితో సహా వాళ్ళమ్మగారు. నేనూ వాళ్ళతో కలిసి శవం దగ్గరకు వెళ్ళాను.

దు:ఖంతో ప్రకాష్ చేతిలో ఉత్తరం అందుకుని ఆత్రంగా చదువుతున్నారు వాళ్ళు. నేను కూడా దాన్లోకి చూశాను.

'అమ్మకీ, నాన్నగార్కీ

ఇన్నాళ్ళునన్ను కొడుకులా చూసుకున్నందుకు కృతజ్ఞతలు. నాన్నగారూ మీరు నేను మీ సొంత కొడుకుని కాదని నా ఫ్రెండ్ నారాయణతో చెబుతూంటే విన్నాను.

ఈ విషయం నాకు ఇదివరకెప్పుడైనా అమ్మ చెప్పినా ఇంతగా బాధపడే వాణ్ణి కానేమో కాని, తమ్ముడు పుట్టాడన్న ఆనందంతో ఆ నిజాన్ని వ్యక్తం చేశారు.

అది విన్నాక నేనూహించుకున్న జీవితంలో ఏదో వెలితి భరించరానిదిగా అనిపించింది. నాకెందుకో జీవించాలనిపించలేదు.

## గురుత్వాకర్షణ

రాము:- పైకి విసిరిన బంతి క్రిందికి రాలేదేంట్రా?

రాజు:- ఆకాశానికి కూడా గురుత్వాకర్షణ శక్తి ఉందేమోరా?

-కెంచు చిన్నన్న, చిన్నమెట్‌పల్లి,
మేడిపల్లి (వయా)
కరీంనగర్ జిల్లా - 505 453.

నా ఆఖరికోరిక 'తమ్ముణ్ణి గాఢగా ముద్దు పెట్టుకోవాలనీ'.

అది తీర్చుకునే వెళ్తున్నా...

నమస్కారాలతో
మీ
ప్రకాష్

ఆ ఉత్తరం అంతా కళ్ళనీళ్ళతో తడిసిపోయింది. అప్పటివరకూ మౌనంగా కుమిలిపోయిన వాళ్ళనాన్నగారు.

"సొంతకొడుకు పుట్టాడన్న పాడుబుద్ధితో, ఆ నిజాన్ని కక్కిన దుర్మార్గుణ్ణి నేనేరా! నేనే. నిజంగా నేను మనిషిని, కాదురా. ఇన్నాళ్ళ పాటూ ఆప్యాయంగా పెంచిన మమకారాన్ని కూడా కాదని..." ఇంకా ఆయన పెదవులు కదుల్తున్నాయి కాని, మాటలు రావట్లేదు.

ముఖమంతా కళ్ళనీళ్ళ పర్యంతమైపోయింది.

ప్రకాష్ శవంమీద తల ఆనించి, గుండెలు బాదు కుంటూ రోదిస్తున్నారతను.

"అమ్మా తమ్ముణ్ణి ఓసారి ముద్దుపెట్టుకుంటాను ప్లీజ్ అమ్మా!" అని వాడు బ్రతిమలితే "పురిటి మైలు తీరేంతవరకూ ముద్దుపెట్టుకో కూడదు" అన్నాను.

అయితే "ముద్దులాడిన తరువాత తలకి స్నానం చేసేస్తానంటూ తువ్వాలు కట్టుకొని మరీ పిల్లాణ్ణి ముద్దులాడాడు. అప్పుడైనా నాకిలా అనిపించలేదు"

అంటూ ఉత్తరం చివర్లోని ప్రకాష్ 'ఆఖరికోరిక'ని కామోలు గుర్తుతెచ్చుకుంటూనే" తనివితీరా ముద్దు లాడుకో" అంటూ చంటిపిల్లాణ్ణి శవంమీద పెట్టి ఏడుస్తు న్నారు వాళ్ళమ్మగారు.

ఒరే నీ మనసులో 'వెలితి'ని భరించలేక నువ్వు వెళ్ళిపోయావు. కాని, ఇప్పుడు నువ్వులేని 'వెలితి'ని మేం ఎలా భరించాలి?'

"ఆ... చెప్పు..." అంటూ శవాన్ని పిచ్చిగా కుదుపు తున్నారు ఆ దంపతులు.

గరిమెళ్ళ బుచ్చిబాబుగారు
కో - ఆపరేటివ్ కాలనీ,
చోడవరం - 531 036.
విశాఖపట్నం జిల్లా